క్లుప్తంగా

కరెంట్ వైర్లు అమర్చితే చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: అడవుల్లో జంతువుల కోసం కరెంట్ వైర్లు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కరెంట్ వైర్లు అమర్చడం వలన ప్రాణాలకు ముప్పు కలుగుతుందన్నారు. కరెంట్ వైర్లకు తాకి చాలా మంది మృతి చెందిన ఘటనలు ఉన్నాయన్నారు. ఎవరైనా కరెంట్ వైర్లు అమర్చితే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు బొడ్రాయి వార్షికోత్సవం

ఏటూరునాగారం: మండల కేంద్రంలో బొడ్రాయి 12వ వార్షికోత్సవ వేడుకలను నేడు (శుక్రవారం) నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పోగుల లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి పది గంటల వరకు పాలాభిషేకం, వస్త్రాలంకరణ, బోనాల సమర్పణ, తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

వాజేడుకు చేరిన పాఠ్యపుస్తకాలు



వాజేడు: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయానికి 2024–25 విద్యా సంవత్సరానికి సబంధించిన పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలానికి 1236 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలల్లో పంపిణీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



వాజేడు: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పాయబాటలు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గెర్రగూడెం గ్రామానికి చెందిన అరెం నరేష్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. పాయబాటకు గ్రామం వద్ద వెనుక వైపు నుంచి ఆటోను ఢీ కొట్టి కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో నరేష్‌కు గాయాలయ్యాయి.

లారీ ఢీకొని ఒకరికి..



ములుగు రూరల్: లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జంగాలపల్లి గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగాపల్లి గ్రామానికి చెందిన గొట్టిముక్కుల నవీన్ అనే కోడిగుడ్ల వ్యాపారి ఇంచర్ల గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో జంగాలపల్లి క్రాస్ చేరుకోగానే ఏటూరునాగారం నుంచి వస్తున్న లారీ రోడ్డు క్రాస్ చేస్తున్న క్రమంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు సమాచారం.

సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం



విరాళం అందజేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

- గ్రామాల్లో పోలీసుల అవగాహన
- ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు తాడ్వాయి పోలీసులు శ్రీకారం చుట్టారు. నేర నియంత్రణ కోసం ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ముందుకు వచ్చారు. ఈ మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. మండలంలోని నార్లాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లాలోనే సీసీ కెమెరాల ఏర్పాటులో తాడ్వాయి మండలం మొదటి గుర్తింపు పొందాలనే లక్ష్యంతో ఉద్యమంలా కెమెరాల ఏర్పాటుకు ముందుకు సాగాలని ఆయన ప్రజలను కోరారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. మేముసైతం అంటూ సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాలపై పోలీసులు కరపత్రాలను ముద్రించారు. కెమెరాల అవసరాన్ని ఉపయోగాన్ని అర్థం చేసుకుని మీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలకు హాజరు కావాలని, కెమెరాల ఏర్పాటు కోసం పూర్తి సహకారాన్ని అందించాలని గ్రామస్తులకు పోలీసులు విజ్ఞప్తి చేస్తూ కరపత్రాల్లో పలు నేరాల అంశాలను ముద్రించారు.

కమిటీల ద్వారానే ఏర్పాటు

మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలోని మాజీ సర్పంచులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, యూత్ సభ్యులు, ట్రాక్టర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ గ్రామంలో కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు సేకరించి కమిటీ ద్వారానే గ్రామంలో కెమెరాల ఏర్పాటు చేయనున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసే టెక్నీషియన్‌కు కమిటీ ద్వారా డబ్బులు అందజేయనున్నారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఆ గ్రామ పోలీసు అధికారి ప్రతి గ్రామంలో మొదటి విరాళం ఇవ్వనున్నారు. గ్రామస్తులు, వ్యాపారులు, పార్టీల రాజకీయ నాయకుల నుంచి కమిటీ విరాళలను సేకరిస్తుంది.

ప్రజల భద్రత కోసమే..



గ్రామాల్లోని ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గ్రామ కమిటీల ద్వారానే సీసీ కెమెరాలు ఏర్పాటు బాధ్యత ఉంటుంది. సీసీ కెమెరాల ఏర్పాటు వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గ్రామంలోని అందరిని భాగస్వామ్యంతో 18 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

– శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై తాడ్వాయి

ఎరువుల గోదాం ప్రారంభం



గోదాం ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: మండల పరిధిలోని ఇంచెర్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోదాం, కార్యాలయాన్ని మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్‌జి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీసీఓ సర్దార్ సింగ్, రైతులతో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ములుగు: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పనులను మంత్రి సీతక్క గురువారం పరిశీలించారు. మోడల్ బస్టాండ్‌గా పునర్నిర్మించాలనే విషయమై కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీతో కలిసి ఆర్టీసీ అధికారులతో చర్చించారు. బస్టాండ్ పరిసరాల్లోని ప్రభుత్వ భూమి వివరాలను అందించాలని ఆదేశించారు. పూర్తి నివేదిక వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ములుగు రూరల్: జిల్లాలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పడుతున్న సమస్యలను పరిష్కారించాలని మంత్రి సీతక్కకు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కోర్టు కేసులపై ప్రభుత్వం చొరవ తీసుకోని పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బదిలీలతో పాటు పదోన్నతులు కూడా కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు రుద్రమ దేవి, కృష్ణ, రమేష్, మంజుల, అపర్ణ, అనీఫ్, సుధారాణి, శ్రీనివాస చారి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ముంజాల భిక్షపతి

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొమరంభీమ్ కాలనీ ఆదివాసీల భూమలకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగవ రోజు భిక్షపతి దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ విధానాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, సూర్యం, నూనె శ్రీనివాస్, నర్సింహరావు, రాజేష్, మనోజ్ తదితరులు ఉన్నారు.

తునికాకు పెండింగ్ బోనస్ చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న తునికాకు కార్మికులు

వెంకటాపురం(కె): పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ డబ్బులను తక్షణమే చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన తునికాకు కార్మికులు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ కార్యాయలం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 2016 నుంచి తునికాకు కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ సొమ్ములను చెల్లించడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తునికాకు బోనస్ డబ్బుల చెల్లింపుపై జిల్లా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల రఘుపతి, వంకా రాములు, గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, దామోదర్, కట్ల నర్సింహాచారి తదితరులు ఉన్నారు.

విద్యార్థులను బడికి పంపించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వాజేడు: బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థుల ఇళ్లకు వాజేడు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెళ్లారు. చెరుకూరు, పేరూరు, చంద్రుపట్ల గ్రామాలకు వెళ్లిన ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని వనరులను, సౌకర్యాలను కల్పిస్తుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందరావు, స్వరూప అ సింగ్, మల్లయ్య, ఆనమ్డ్, రాజ్య లక్ష్మి, రవికుమార్, వాశ్య, శ్రీకాంత్, అమ్మాజిరాణి, రమేష్ ఉన్నారు.

ఇష్టారీతిన మద్యం అమ్మకాలు

మధ్యాహ్నం 12 గంటల వరకు తెరుచుకోని వైన్ షాప్

పట్టించుకోని అధికారులు



మధ్యాహ్నం 12 గంటలకు తాళం వేసి ఉన్న మద్యం దుకాణం

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌లో గల మద్యం దుకాణం మధ్యాహ్నం 12 దాటిన కూడా తెరుచుకోలేదు. దీంతో మద్యం ప్రియులు దుకాణం వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకు నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచాలి. కాటాపూర్ మద్యం షాప్ నిర్వాహకులు ప్రభుత్వం నిబంధనలను పట్టించుకోవడం లేదని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు దుకాణం తెరువకపోవడం ఎక్సైజ్‌శాఖ అధికారుల అలసత్వం కారణంగానే మద్యం దుకాణం నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో బెల్టు షాపులపై ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. బెల్టు షాపులో ఎమ్మార్పీ కంటే క్వాటర్‌పై రూ.50 చెల్లించి మద్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి తలెత్తుతుందని, మద్యం దుకాణంలో కూడా ఎమ్మార్పీ కంటే క్వాటర్ సీసాపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. మద్యం దుకాణం సమయానికి తెరువకపోవడంతోపాటు సాయంత్రం 5 గంటల వరకే తాళం వేస్తున్నారని ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు మమ్ముళ్లు తీసుకోవడంతోనే నిర్వహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

కనిపించని నేమ్ బోర్డు

మద్యం దుకాణం వద్ద కనీసం నేమ్ బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. మద్యం షాపు ఉన్న విషయం కూడా తెలియకుండా ఉంది. దుకాణం వద్ద నేమ్ బోర్డుతో పాటు ధరల పట్టిక కూడా లేదు. కొత్త వ్యక్తులకు మద్యం దుకాణం ఉన్న అనవాళ్లు కూడా తెలియకుండా ఉంది. అన్ని రకాల బ్రాండ్‌లు బెల్టు షాపుల్లో మాత్రం దొరుకుతున్నాయని కానీ మద్యం దుకాణంలో మాత్రం దొరకడం లేదని మద్యం ప్రియులు చెబుతున్నారు. కాగా, మద్యం దుకాణం మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా తెరువలేదనే విషయాన్ని ములుగు ఎక్సైజ్‌శాఖ సీఐ సుధీర్‌కుమార్ వివరణ కోరగా మద్యం దుకాణం పని చేసే గుమాస్తాలు ఆర్టీసీ బస్సుల్లో రావడం వలన షాపు సమయానికి తెరువడం లేదని సమాధానం ఇచ్చారు. ఫోన్ చేసి మాట్లాడుతానని నిర్లక్ష్యంగా చెప్పారు.

చెత్తాచెదారం తొలగింపుపై ప్రత్యేక దృష్టి



పనులు పరిశీలిస్తున్న కార్యదర్శి రమాదేవి

ఏటూరునాగారం: చెత్తాచెదారం తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఏటూరునాగారం పంచాయతీ కార్యదర్శి రమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మురుగు కాల్వల్లో చెత్తాచెదారం తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పనులను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. కాల్వల్లో చెత్తాచెదారం పడేయకుండా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను చెత్తా కుండీల్లో వేయాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

పరామర్శ

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాల్గురి నరేందర్, బల్గురి రామారావు, ఆకుతోట సుధాకర్, కదారి ఐలయ్య, ఇంజపెల్లి శ్రీనివాస్ ఇటీవల మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆకుతోట సుధాకర్, ఇంజపెల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తి రాజు, బొచ్చు శ్రీనివాస్ ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక



నివేదిక చదివి వినిపిస్తున్న డీఆర్‌పీలు

మంగపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 01 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 25 గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులపై ఈనెల 01 నుంచి 12 వరకు నిర్వహించిన సామాజిక తనఖీల వివరాల నివేదికలను డీఆర్‌పీలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిసస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వ్యవహరించిన తీరును వెల్లడించారు. తిమ్మంపేటలో జాడి మంగమ్మ, సల్పాటి సమ్మక్క, లొట్టి అంజమ్మ, గోమాసు లక్ష్మీనారాయణ పనులు చేయకుండా చేసినట్లుగా జాబ్‌కార్డుల్లో మస్టర్లు వేసుకుని కూలి డబ్బులు తీసుకున్నట్లు వెల్లడించారు. అంతే కాకుండా తిమ్మంపేటలో తిమ్మచెరువులో పనులు చేయకుండా 74 మంది పనిచేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించినట్లు ఆధారాలు చూపించారు. టీఏలు కొందరు తప్పుడు కొలతలతో ఎక్కువ డబ్బులు చెల్లింపు చేశారని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, టీఏలు సిబ్బందికి రూ.53,250 ఫెనాల్టీ, రూ.39, 860 రికవరీ వసూలు చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటనారాయణ, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరంసింగ్, సోషలాడిట్ ఇన్‌చార్జ్ సమ్మయ్య, ఎస్ఆర్‌పీ కుమార్, ఆడిషనల్ పోగ్రాం కోఆర్డినేటర్ అంజయ్యగౌడ్, ఈజీఎస్ ఏపీఓ అంకూస్, సునీత, జేఈ శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట, లక్ష్మినరసింహ స్వామి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18, 19, 20న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మరాఠీ కాంతారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో కొమురయ్య భవన్‌లో శిక్షణ తరగతుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాసపల్లి భద్రయ్య, పీక రవికాంత్, నేరెళ్ల జోసఫ్ సంధ్య, చిట్యాల పద్మ, చల్లూరి రక్షిత, రేవెల్లి రాధిక, వైష్ణవి, మౌనిక పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఎస్ తాడ్వాయి: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



గోవిందరావుపేట: ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్సై కమలాకర్

ఎస్ఎస్‌తాడ్వాయి: వరద ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని వరద ముంపు గ్రామాల్లోని ఎల్బాక, పడిగాపూర్ గ్రామస్తులతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో జంపన్నవాగు వరద ముంపు ప్రజలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత చర్యలను వివరించారు. గతేడాది వర్షకాలంలో ఎదురైన వరద ముంపు వలన భారీ నష్టం వాటిల్లిందని ఈసారి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలకు వరద పరిస్థితులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సహకారాలు అందిస్తామన్నారు.

గోవిందరావుపేట: మండల పరిధిలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాలను గురువారం పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ సందర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకోని ఎస్పీ ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండల కేంద్రంలోని విల్సన్ కాలనీని సందర్శించినట్లు తెలిపారు. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీస్ వారికి, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే



టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే కొనసాగుతుంది. గురువారం అధికారులు ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నీటి కుళాయి ఉందా, ఉంటే పని చేస్తుందా, లేదా అనే విషయాలను నమోదు చేశారు. అలాగే రికార్డుల్లో పేరు లేకుంటే నమోదు చేసుకుంటూ, మృతి చెందిన వారి వివరాలను సైతం నమోదు చేసుకుంటున్నారు. ఈ సర్వేలో మిషన్ భగీరథ నీళ్లు ఎంత మంది అందుతున్నాయి, ఎంత మంది మృతి చెందారు అనే విషయాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడించారు.